క్వారీ భూములపై.. సర్కారు నజర్!

• లీజుల రద్దుకు యోచన • పరిశ్రమలకు కేటాయించే అవకాశం

న్యూస్‌టుడే, పటాన్‌చెరు



క్వారీల్లో తవ్వకాలు

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఐటీ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు భూములు పూర్తిస్థాయిలో ఉంచే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. కాలుష్యరహిత పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చేట్టు పాలకులు నిర్ణయాలు తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్కార్ స్థలాల్లో ఇచ్చిన కంకర మిషన్‌లకు చెందిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇదీ పరిస్థితి..

పటాన్‌చెరు నియోజకవర్గం పూర్తిగా హైదరాబాద్‌కు ఆనుకొని ఉంది. ప్రతి గజం స్థలం విలువైనదిగా మారింది. దీన్ని పూర్తిగా ప్రజా సంక్షేమానికి వినియోగించాలని సర్కారు భావిస్తోంది. కాలుష్య తరహా పరిశ్రమలకు పెద్దఎత్తున భూ కేటాయింపులు చేయాలని అధికారులు నిర్ణయించారు. రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండటం, నగరశివారు ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన అన్ని క్వారీల అనుమతులు రద్దు చేసే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. త ద్వారా ఐదు వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తీసుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. పటాన్‌చెరు మండలం లక్డారం, సంగారెడ్డి మండలం ఎర్దనూరు, బేతోలు గ్రామాల్లో ఏడు క్వారీలు ఉన్నాయి. వాటిని రద్దు చేయనున్నారు. 2500 ఎకరాల భూమిని ఐటీకారిడార్ పరిశ్రమలకు అప్పగించాలని నిర్ణయించారు. రాజీవ్‌స్వగృహకు ఇచ్చిన ఐదు వందల ఎకరాల్లో 250 ఎకరాలను రెవెన్యూ అధికారులు వెనక్కి తీసుకున్నారు. మిగిలిన 250 వెనక్కి రావాల్సి ఉంది. లక్డారం గ్రామం ముత్తంగి ఔటర్ జంక్షన్‌కు ఎనిమిది కిలోమీటర్లు, జాతీయ రహదారికి నాలుగు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉందని అధికారులు నివేదిక ఇచ్చారు.



కంకర తరలింపు

అమీన్‌పూర్ మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో వైద్య ఆరోగ్య పరికరాలు తయారీ పరిశ్రమల ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అడ్డంకిగా ఉన్న నాలుగు కంకర మిషన్‌లు ఉన్నాయి. ఇప్పటికే వాటికి ఆనుకొని 521 ఎకరాల భూసేకరణ జరిపి కాలుష్యరహిత పరిశ్రమల ఏర్పాటుకు టీఎస్ఐఐసీకి భూమిని అప్పగించారు. ఇందులో ఉన్న నాలుగు క్వారీల అనుమతులు రద్దు చేయనున్నారు. నాలుగు వందల పైచిలుకు ఎకరాలు ఇచ్చారు. మిగిలిన భూమిని క్వారీలు ఖాళీ అయిన తరువాత ఇవ్వనున్నారు. జిన్నారం మండలం మాదారం, సోలక్‌పల్లి, ఖాజిపల్లి గ్రామాల్లోని 15 క్వారీలు ఉన్నాయి. వాటికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములతో పాటు కంరమిషన్‌లకు సంబంధించిన భూములను కూడా పరిశ్రమల ఏర్పాటుకు ఇవ్వనున్నారు. ఇప్పటికే రామచంద్రాపురం మండలం కొల్లూరు, వెలిమెల గ్రామాల్లో భూసేకరణ జరిపే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రుద్రారానికి అనుసంధానంగా..

రుద్రారం పారిశ్రామికవాడకు అనుసంధానంగా లక్డారం గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఇప్పటికే రసాయన పరిశ్రమలు ఉన్నాయి. వాటికి దూరంగా ఉండేటట్టు చేసి ఐటీ ఆధారిత పరిశ్రమలను లక్డారం గ్రామంలో అభివృద్ధి చేయనున్నారు. వేల ఎకరాల భూమి గ్రామంలో ఉంది. దీంతో గ్రామాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. టీఎస్ఐఐసీ ఎండి నర్సింహారెడ్డి గ్రామాన్ని సందర్శించారు. భూముల వివరాలు సేకరించారు. కేటాయింపుల విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేదానిపై ప్రత్యక్ష పరిశీలన చేశారు. అటు జిల్లా కలెక్టర్ మాణిక్కరాజ్ స్వయంగా పర్యవేక్షణ జరుపుతున్నారు. నిత్యం తహసీల్దార్ గిరితో మంతనాలు జరుపుతున్నారు. గతంలో రాజీవ్‌స్వగృహ నిర్మాణాలకు ఐదువందల ఎకరాల భూసేకరణ సమయంలో అసైన్డ్ భూములు చెల్లింపులు జరిపి వెనక్కి తీసుకున్నారు.

ఆ దిశగా చర్యలు: గిరి, తహసీల్దార్

ఐటీ తరహా పరిశ్రమలకు భూ కేటాయింపులు జరపడానికి వీలుగా భూసేకరణ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటున్నాం. గతంలో కేటాయింపులు జరిపిన కంకరమిషన్‌ల భూకేటాయింపులు రద్దు చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. చాలా వరకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అభివృద్ధికి సహకారం అందిస్తున్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో పూజలు



పోచమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

తునికి, కౌడిపల్లి: మండల పరిధిలోని తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. పూజలు చేపట్టడంతో పాటు ఒడిబియ్యం, బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. పూజారి శివప్ప ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్, సిబ్బంది సౌకర్యాలను పర్యవేక్షించారు. మధ్యాహ్నం పరిసరాల్లో విందు భోజనాలు చేయడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది.

వెల్దుర్తి: వెల్దుర్తి పట్టణ శివారులో వెలిసిన దేవతల చెరువు వద్ద కొలువైన ప్రసిద్ధి చెందిన గోనె మైసమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. వెల్దుర్తి పరిధిలోని అంగడిపేటవాసులు, గ్రామ సేవకులు ఆలయ పరిసరాల్లో వన భోజనాలు చేశారు. వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ పరిసరాల్లోనే వన భోజనాలు చేశారు.



వెల్దుర్తి: గోనె మైసమ్మ అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు

‘మల్లన్న’ సన్నిధిలో భక్తుల రద్దీ





రాజగోపురం లోపల భక్తుల రద్దీ

చేర్యాల, న్యూస్‌టుడే: శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సాధారణంగా ఆదివారం ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకు తోడు శ్రావణమాసం ఈ ఆదివారంతో ముగుస్తుండటంతో మరింత అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల తాకిడితో ఆలయం ఎదుట, కోనేరులో, దర్శనం క్యూలైన్లలో, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద ఎక్కడ చూసినా భక్తులతో ఆలయ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. బోనంతో ఆలయానికి తరలివచ్చిన భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు మూడు గంటల పాటు ఎదురుచూడాల్సి వచ్చింది. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలతో పాటు



ఆలయం ప్రధాన రహదారిలో కోలాహలం

కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన భక్తులే ఎక్కువగా స్వామి దర్శనానికి వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ముందుగా కోనేరులో పుణ్యస్నానం చేసి, స్వామి దర్శనానికి బయలుదేరారు. ‘మల్లన్న’ దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో, గంగరేణి చెట్టు వద్ద స్వామివారికి పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని ముఖమండపంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారికి భక్తులు సామూహిక కల్యాణం నిర్వహించారు. ఈ ఆదివారం 20 కుటుంబాలు స్వామివారికి కల్యాణం చేయించగా, 35 కుటుంబాల వారు ‘మల్లన్న’కు అభిషేకాలు చేయించారు.

పటాన్‌చెరు

‘పరిశ్రమ లాకౌట్‌ను ఎత్తివేయండి’

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: సదాశివపేట పట్టణంలోని ప్రియదర్శిని పరిశ్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పరిశ్రమ యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపించారు. లాకౌట్‌ను ఎత్తివేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మొక్కలు ఎలా..!

☛ హరితహారానికి గండం

☛ నర్సరీలు ఉన్నా పెరగని పచ్చదనం


నాటడానికి పనికి రాకుండా ఉన్న మొక్కలు

న్యూస్‌టుడే, జిన్నారం :

ప్రణాళిక లేక హరిత హారం కార్యక్రమం వెలవెల బోతోంది. వర్షాలు కురిసే సమయానికి మొక్కలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. జిన్నారం మండలంలో రెండు నర్సరీలు ఉన్నా ఫలితం లేకుండా పోయింది. అటవీ శాఖ అధికారులు నర్సరీలపై పెద్దగా దృష్టి సారించకపోవటం, ఇక్కడి అవసరాన్ని గుర్తించకపోవటంతో సమస్య ఏర్పడింది. ప్రస్తుతం మొక్కలు నాటేందుకు కొన్ని గ్రామాల్లో ఏర్పాట్లు జరిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఉపాధి అధికారులు ఇతర మండలాల నుంచి మొక్కలు తేవటం కనిపించింది.

దృష్టి సారించకనే...

ప్రతి ఏటా జులై నెలలో హరితహారం ప్రారంభమౌతుంది. ఆ సమయానికి మొక్కలు నాటడానికి అనుకూలంగా ఉండాలి. ఈ సారి సోలక్‌పల్లి నర్సరీలోనే కొన్ని మొక్కలు ఉండగా ముందుగా వచ్చిన వారికే సరిపోయాయి. వావిలాల నర్సరీలో ఉన్న కొద్ది పాటి మొక్కలను ఓ పరిశ్రమ తీసుకుపోయింది. వావిలాలలో ఈ సారి కొత్తగా మొక్కలు పెంచలేదు. ప్రధానంగా ఉపాధిహామీ జాబ్‌కార్డుల సమస్యతో బిల్లుల చెల్లింపు ఇబ్బందిగా మారటంతో ఇక్కడి మొక్కల గురించి పట్టించు కోలేదు. సోలక్‌పల్లిలో ఏర్పాటు చేసిన నర్సరీకి జనవరి తరువాత విత్తనాలు, మొక్కలు రావటంతో జులై వరకు అవి పెరగలేదు. సోలక్‌పల్లి నర్సరీలో 2.8లక్షల మొక్కలు పెంచామని అంటున్నారని కానీ అక్కడ ఆ పరిస్థితి కానరావటం లేదు. ఏపుగా పెరిగే మొక్కలను సకాలంలో తెచ్చి పెంచితేనే హరిత హారానికి పనికి వచ్చేవని అంటున్నారు. కానీ అటువంటి దేమీ చేయలేదు.

బాగా డిమాండ్...

జిన్నారం మండలంలో మొక్కలకు బాగానే డిమాండ్ ఉంటుంది. గ్రామాలతో పాటు పరిశ్రమల్లోనూ మొక్కలు నాటుతారు. గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమనే 45 వేల మొక్కలు నాటుతామని ప్రకటించింది. అయితే ఇప్పటి దాకా ఆ పరిశ్రమ 10వేల మొక్కలు కూడా నాట లేదని అంటున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని ఇతర మండలాల వారు సైతం ఇక్కడి నుంచే మొక్కలు అడిగారని అంత డిమాండ్ ఉంటుందని మేం అనుకోలేదని స్థానిక అధికారులు అంటున్నారు.

తెల్లాపూర్ నుంచి...

మండలంలో రెండు నర్సరీలు ఉన్నా అక్కడ పెంచిన మొక్కలు నాటడానికి వీలులేని పరిస్థితిలో ఉన్నాయి. దీంతో ఉపాధిహామీ పథకం అధికారులు రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ నుంచి తెచ్చారు. ఇదిలా ఉండగా జిన్నారం మండలంలోని రెండు నర్సరీలు ఎన్ని మొక్కలు పెంచారు? ఎన్ని పంపిణీ చేశారు? ఎక్కడ నాటారనేదానికి పొంతన లేదు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల కూడా సమస్య ఏర్పడిందని అంటున్నారు.

ఇతర మండలాల నుంచి...: రఘునాథస్వామి, అటవీశాఖ అధికారి, వావిలాల

ఈ సారి ఇతర మండలాల నుంచి డిమాండ్ బాగా పెరిగింది. అందుకే మొక్కల కొరత ఏర్పడింది. హత్నూరా మండలంలోని పలు నర్సరీల నుంచి మొక్కలు తెప్పించాం. వచ్చే ఏడాది మరిన్ని నర్సరీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.


వావిలాల నర్సరీలో పరిస్థితి ఇలా

ఉద్యోగాలు భర్తీ చేయాలి

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న ఉద్యోగ నియామకాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం భర్తీ చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు అన్నారు. ఈ మేరకు పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు గడ్డ యాదయ్య నివాసంలో ఎంఆర్‌పీఎస్ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేటట్టు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు లాజర్, రాములు, కూరలింగయ్య, గాంగారామ్, సత్యక్క పాల్గొన్నారు.

విద్యార్థులది చురుకైన పాత్ర

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి తెలంగాణ వచ్చేందుకు కృషి చేశారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు శివారు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం టీఆర్‌ఎస్‌వీ విభాగం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థి విభాగం కమిటీల కొరకు అభిప్రాయసేకరణ చేస్తామని తెలిపారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం, జిన్నారం, అమీన్‌పూర్, గుమ్మడిదల మండలాలకు కొన్ని పేర్లు సూచించడం జరిగిందని తెలిపారు. ఎవ్వరూ నిరుత్సాహ పడకూడదని పార్టీ అందరికీ అవకాశం ఇస్తుందని తెలిపారు. విద్యార్థులకు కేసీఆర్ ఎన్నో అవకాశాలు కల్పించారని కొన్ని సమయాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మండలపార్టీ అధ్యక్షులు దశరథ్‌రెడ్డి, తెరాస పట్టణ అధ్యక్షులు విజయ్, యువజన జిల్లా అధ్యక్షులు వెంకటేష్, హెచ్‌డీసీ సభ్యులు శ్రీనివాస్, వార్డుకమిటీ సభ్యులు నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

సంగారెడ్డి టౌన్: డిమాండ్ల సాధన కోసం ఐకేపీ మండల సమాఖ్య ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెరాస ప్రభుత్వం ఉద్యోగుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వ తీరు మార్చుకోకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

తండాల అభివృద్ధికి కృషి చేయాలి

సీతారాంకుంట, (కొండాపూర్): తండాలను వెంటనే గ్రామ పంచాయతీలుగా మార్చి.. అభివృద్ధి చేయాలని భాజపా మండల అధ్యక్షుడు ఎ.ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మాచేపల్లి శివారు సీతారాంకుంట తండాలో నిర్వహించిన గిరిజన మోర్చా మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మండల మాజీ అధ్యక్షుడు మల్లేశం, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రాత్లా నేహ్రూ, నేతలు శివాజీ, శ్రీనివాస్, సికిందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతల హర్షం

అల్లాదుర్గం: గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో శనివారం సాయంత్రం నుంచి జోరుగా వర్షం కురవడంతో గ్రామాల్లోని వీధులు జలమయమయ్యాయి. గత 20 రోజులుగా వర్షం కురవకపోవడంతో సాగు చేసిన పంటలకు నీరు లేక వాడి పోయే స్థితికి చేరుకున్నాయి. వర్షం కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లు అయిందని అల్లాదుర్గం, కాయిదంపల్లి, రాంపూర్, చిల్వేర్, మాందాపూర్, ముప్పారం, తదితర గ్రామాల రైతులు పేర్కొన్నారు.

రుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన

అల్లాదుర్గం: గడిపెద్దాపూర్ గ్రామంలో లోక కల్యాణార్థం రుద్ర పరిషత్తు ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు ఆశించిన స్థాయిలో పండి రైతులు సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. వరుణుడు కరుణించి వేసిన పంటలు ఎండి పోకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుద్ర పరిషత్తు సభ్యులు, పురోహితులు రాము పాల్గొన్నారు.

భక్తులతో వీరభద్రస్వామి ఆలయం కిటకిట

న్యూస్‌టుడే, గుమ్మడిదల: శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో భక్తుల శివనామ స్మరణతో వీరభద్ర స్వామి ఆలయం హోరెత్తింది. ప్రముఖ ఆలయం కావడంతో... జంటనగరాల నుంచి, జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయం నుంచే వాహనాలలో రావడం కనిపించింది. ఆలయం సమీపంలో వాహనాలను నిలిపి.. ఆలయంలో ప్రత్యేక పూజలకు బారులు తీరారు. వీరభద్రస్వామి రుద్రభిషేకం, స్పర్శ పూజ, సామూహిక అభిషేకాలకూ భక్తుల రద్దీ కనిపించింది. పూజలు, వ్రతాలు చేయడానికి భక్తులు వేచి ఉండడం కనిపించింది. ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు భక్తులతో ఆలయం కిటికిట లాడింది. దర్శనానికి భక్తులు రాజగోపురం వెలుపలి వరకు బారులు తీరి కనిపించారు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, ఛైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. దూరం నుంచి వచ్చిన భక్తులకు కావలసిన వసతి సౌకర్యాలు, ఏర్పాట్లను సమకూర్చారు.


లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు


అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

మట్టి, ఆవుపేడతో..

వైకుంఠపురం వినాయకుడు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని వైకుంఠపురం దేవాలయంలో కాలుష్య రహిత వినాయకుడిని తయారు చేయాలని నిర్ణయించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మట్టి, ఆవుపేడతో తయారు చేసే వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ వినాయక విగ్రహం పనులు దేవాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు పూజలు చేసి ప్రారంభించారు. ప్రకృతి ప్రసాదించిన ముడి పదార్థాలతో 18 అడుగుల గజముఖ గణనాథుడి విగ్రహాన్ని ఈ నెల 25న వినాయక చవితి రోజున ప్రతిష్ఠిస్తామని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సెప్టెంబరు 1న నిరసన ర్యాలీ

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: నూతన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1న నిర్వహించనున్న నిరసన ర్యాలీ, ధర్నాలను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.లక్ష్మారెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్ కోరారు. ఆదివారం స్థానిక అతిథి గృహంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెప్టెంబరు 1న విద్రోహదినంగా పాటించనున్నట్టు పేర్కొన్నారు. ఆ రోజున ఉద్యోగులు, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు నాసర్‌పటేల్, సోమశేఖర్, అశోక్, రవీందర్, వరప్రసాద్, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

నేడు పరిపాలన కార్యాలయంలో ప్రజావాణి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిపాలనాధికారి కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు జిల్లా పాలనాధికారి సహా అధికారులు అర్జీలు స్వీకరిస్తారు. ప్రజలు తమ ఇబ్బందులను నేరుగా అధికారులకు విన్నవించే అవకాశం ఉంటుంది.

మండల స్థాయి అధికారులతో దూర దృశ్య సమీక్ష నేడు

సంగారెడ్డి టౌన్: మండల స్థాయి అధికారులతో జిల్లా పాలనాధికారి, సంయుక్త పాలనాధికారులు సోమవారం జిల్లా పరిపాలన కార్యాలయం నుంచి ఉదయం 10:30 గంటలకు దూర దృశ్య సమీక్ష నిర్వహించనున్నారు. ప్రతి సోమవారం మాదిరిగానే ఈ వారం కూడా పలు అంశాలపై సమీక్షతోపాటు, సూచనలు చేయనున్నారు. నారాయణఖేడ్ డివిజన్‌కు చెందిన అర్జీదారులతో జిల్లా పరిపాలన కార్యాలయం నుంచే దూర దృశ్య సమీక్ష నిర్వహించి సమస్యలు తెలుసుకోనున్నారు.

ఆన్‌లైన్ విధానం.. ఇక సత్వర పరిష్కారం

ఫిర్యాదులకు ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు • డిజిటల్ ఇండియాలో భాగంగా నిర్ణయం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్




అంతర్జాలంలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎన్ఐసీ అధికారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో సాంకేతిక అంశాలకు సంబంధించిన విషయాలను నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసీ) చూస్తుంది. ఉమ్మడి జిల్లా కేంద్రాలన్నింటిలోనూ ఇవి ఉన్నాయి. ఎన్ఐసీ సేవలు వినియోగించుకున్న ఆయా శాఖలు, అధికారులు సాంకేతికపరంగా ఏమైనా సమస్యలు తలెత్తితే ఫిర్యాదు నమోదు చేసేందుకు సరైన వ్యవస్థ లేకపోవటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మొబైల్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినా పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఇక మీదట ఆ ఇబ్బందులు తీరనున్నాయి. ఫిర్యాదులకు సత్వర పరిష్కారంతో పాటు పారదర్శకత పెంచాలన్న ఉద్దేశంతో ఎన్ఐసీ ముందుకు సాగుతోంది. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుల నమోదు, పరిష్కారానికి ఆన్‌లైన్ విధానం అమలుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

ఫిర్యాదుల నమోదు ఆన్‌లైన్‌లోనే..

బయోమెట్రిక్ అటెండెన్స్ విధానంలో యంత్రంపై వేలిని పెట్టగానే ఉద్యోగి విదుల్లోకి వచ్చిన సమయం నమోదవుతుంది. ఆధార్ అనుసంధాన బయోమెట్రిక్ హాజరు విధానం ప్రస్తుతం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాలయంలో అమలులో ఉంది. కలెక్టరేట్‌లోనూ అమలు చేసే యోచనలో ఉన్నారు. మెదక్ కలెక్టరేట్‌తో పాటు పలు కార్యాలయాల్లోనూ ఈ విధానం అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎన్ఐసీ ఈమెయిల్ ఐడీలు కలెక్టర్, జేసీలతో పాటు పలు శాఖలకు ఉన్నాయి. దీనిద్వారా ఉచితంగా మెయిల్ సదుపాయం అమల్లో ఉంది. ఆయా సేవలకు సంబంధించి ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా ఇక మీదట ఫిర్యాదులను ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం http:///servicedesk.nic.in సైట్‌లోకి వెళ్లి జిల్లాను ఎంపిక చేసి.. ఫిర్యాదును నమోదు చేయాలి.



ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో సర్వీస్ డెస్క్

ఫిర్యాదుదారులకు సమాచారం

సర్వీస్ డెస్క్‌కు వచ్చిన ఫిర్యాదు సంబంధిత డీఐవో (డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మాటిక్ అధికారి)కి వెళుతుంది. జిల్లా స్థాయిలోనే సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటే వెంటనే పరిష్కరించి, ఫిర్యాదుదారుడి మొబైల్‌కు, ఈమెయిల్‌కు సమాచారం చేరవేస్తారు. ఒక వేళ సమస్య రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సి ఉంటే హైదరాబాద్‌లోని ఎన్ఐసీ కార్యాలయానికి కేంద్ర స్థాయి అయితే దిల్లీలోని ఎన్ఐసీ కార్యాలయానికి ఫార్వర్డ్ చేస్తారు.

ఉమ్మడి జిల్లాకు సేవలు ఇక్కడి నుంచే..

ఎన్ఐసీకి సంబంధించి.. సాంకేతికపరంగా సలహాలు, సూచనలు సంగారెడ్డిలోని ఎన్ఐసీ కార్యాలయం నుంచే ఇస్తారు. సంగారెడ్డితోపాటు సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలో ఎన్ఐసీ సేవలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఇక్కడి నుంచే పరిష్కారం చూపాల్సి ఉంటుంది. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేసిన సర్వీస్‌డెస్క్‌కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి కూడా ఇదే వర్తిస్తుంది.

మెరుగైన సేవలకు అవకాశం: శాంతికుమార్, ఎన్ఐసీ డీఐఓ

ఎన్ఐసీ సర్వీస్ డెస్క్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల నమోదుకు అవకాశం కల్పించడంతో సేవల మెరుగుకు అవకాశం ఉంటుంది. ఫిర్యాదును పరిష్కరించడంతో పాటు ఫిర్యాదుదారు మొబైల్‌కు, ఈమెయిల్ ఐడీకి సమాచారం చేరవేయటంతో పారదర్శకత పెరుగుతుంది. ఎన్ఐసీ సేవలు వినియోస్తున్న అధికారులు, శాఖలన్నీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సింగూరు ప్రాజెక్టులోకి వరద

300 క్యూసెక్కుల నీరు చేరిక

పుల్కల్: నెల రోజుల తరువాత మళ్లీ సింగూరు ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. అల్పపీడన ప్రభావంతో ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద రాక ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రానికి 300 క్యూసెక్కుల వరద నీరు చేరింది. పై నుంచి వరద ఉద్ధృతి కొనసాగుతోందని నీటి పారుదలశాఖ డిప్యూటీ ఈఈ బాల గణేష్ తెలిపారు.

ఫలాంబరి దేవీగా వనదుర్గ



పాపన్నపేట: ఏడుపాయల వనదుర్గామాత ఆదివారం ఫలాంబరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గ ఆలయంలో వర్షం కారణంగా భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేపట్టారు. పలువురు తలనీలాలు, బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సల్లంగ సూడు దుర్గమ్మ తల్లి అంటూ అమ్మవారిని వేడుకుంటూ దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఖైదీలకు సాక్షర భారత్ ఆధ్వర్యంలో రాత పరీక్ష

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సాక్షర భారత్ ఆధ్వర్యంలో ఆదివారం కంది జిల్లా జైలులో రాత పరీక్షలు నిర్వహించారు. 60 మంది ఖైదీలు ఈ పరీక్షలకు హాజరయ్యారు. సాక్షర భారత్ ఉప సంచాలకులు ఉషామార్త స్వర్ణలత తనిఖీలు చేశారు. ఆమె వెంట జైలర్ కాళిదాస్, ఉప జైలర్లు ప్రభాకర్, చంద్రశేఖర్, సాక్షర భారత్ మండల సమన్వయకర్త తలారి నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాల ప్రకారం.. ఉద్యోగాల భర్తీకి డిమాండ్



బీజేవైఎం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: కొత్త జిల్లాల ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలని భాజపా జిల్లా అధ్యక్షుడు కాసాల బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో భాజపా యువమోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పాత జిల్లాల ప్రకారం కొత్త ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనను వెంటనే ఉప సంహరించుకోవాలని కోరారు. పార్టీ బలోపేతానికి యువకులే మూల స్తంభంలాంటి వారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై యువత ముందుండి పోరాటం చేయాలని సూచించారు. యువమోర్చా జిల్లా బాధ్యులు ప్రీతమ్ రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబరు 17న విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించకుంటే అదే రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తమ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరిస్తామని చెప్పారు. ఐఐటీ భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, స్థానిక పరిశ్రమలలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలకు యువతను బానిసలుగా మార్చడంలో హైదరాబాద్ చిక్కు కోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మండలంలో ఒక డిగ్రీ కళాశాల, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో 24 గంటలు వైద్య సేవలు, కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలని, గురుకులాలకు ప్రత్యేక భవనాలు నిర్మించాలని తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు అనంతరావు కులకర్ణి, పి.సురేందర్, విజయ్‌కుమార్, పవన్‌కుమార్, కుమార్, నాగరాజు, సంతోష్, రాముగౌడ్, వినోద్, వీరేందర్, వెంకటేశ్, సాయికృష్ణ, సూర్యకాంత్, మహేశ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం..

తరలివచ్చిన మిత్రబృందం

న్యూస్‌టుడే, సిద్దిపేట: సిద్ధిపేటలోని ఎవర్ గ్రీన్ క్లబ్...! 1979లో పురుడు పోసుకున్న ఈ క్లబ్ నాడు ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ఈ ప్రాంతానికి వన్నె తెచ్చింది. కాలచక్రం గిర్రున తిరిగింది. నాడు యువకులుగా ఉన్న వారంతా నేడు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. కొంత మంది వృద్ధులు అయ్యారు. మరికొందరు ఆ దశకు చేరుతున్నారు. రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారూ ఉన్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ నాటి సభ్యులంతా కలిస్తే బాగుంటుంది.. స్మృతులను నెమరు వేసుకుంటే ఆనందంగా ఉంటుందనే తలంపుతో క్లబ్ ప్రతినిధి, ప్రస్తుత ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ భావించారు. మిత్రుడు సికిందర్ ద్వారా నాటి క్లబ్ ప్రతినిధులందరికీ సమాచారం ఇచ్చి సిద్ధిపేట శివారులోని భైరి అంజయ్య గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాజకీయ, వ్యాపార, ఉద్యోగ, వాణిజ్య రంగాల్లో ఉన్నత స్థాయికి చేరిన వారెందరో హాజరయ్యారు. నాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ...తన రాజకీయ జీవితానికి ఈ క్లబ్ పునాది అన్నారు. గత చరిత్ర మననం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ మిత్రబృందం అండదండల వల్ల ఈ స్థితికి ఎదిగామన్నారు. ఎక్కడికి వెళ్లినా తన జీవితంలో క్లబ్ పాత్రను వివరిస్తానన్నారు. పండ్లు, కూరగాయలు అమ్మి ఈ స్థాయికి చేరానన్నారు. జీవితంలో అన్నీ సాధించానని, తన ఎదుగుదలకు సహకరించిన మిత్రులకు ఏ కష్టం వచ్చినా హనుమంతుడిలా వాలిపోతానన్నారు. ఎవరికైనా అనారోగ్య సమస్య తలెత్తితే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటామన్నారు. తెలంగాణ చలన చిత్ర బోర్డు ఛైర్మన్ ప్రతాని రామకృష్ణా గౌడ్, బల్దియా మాజీ ఛైర్మన్ వెనిశెట్టి రాజమౌళి, ప్రముఖ వైద్యుడు రాంచందర్‌రావు, విశ్రాంత ఏసీపీ అనిల్, జడ్చర్ల ఏఎంసీ మాజీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి గంప మహేందర్‌రావు, తెరాస నేత సికిందర్, వివిధ రంగాలకు చెందిన మార్క రాందాస్ గౌడ్, వెన్నెల రాజమౌళి, రాములు, చాంద్, దామోదర్, ప్రకాశ్ తదితరులు జ్ఞాపకాల దొంతరలు కదిలించారు. క్లబ్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, మిత్రులతో గడిపిన ఆనంద క్షణాలను నెమరేసుకున్నారు. ఈ దశలో మళ్లీ క్లబ్‌కు పునరుజ్జీవం పోసి సేవా కార్యక్రమాలు చేపట్టాలని అభిలషించారు. ఈ సందర్భంగా మార్క రాందాస్ గౌడ్ బృందం ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌ను సన్మానించింది. పిదప ఫారూఖ్ హుస్సేన్ క్లబ్ సభ్యులను సన్మానించారు. దౌలత్‌రావు హాస్యంతో కార్యక్రమాన్ని రక్తికట్టించారు.

మట్టిపాలైన మళ్లింపు దారులు...!

☛ భారీ వర్షంతో స్తంభించిన రాకపోకలు ☛ నిత్యం ఇబ్బందుల్లో ప్రయాణికులు

కల్హేర్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. నారాయణఖేడ్ డివిజన్‌లోని కల్హేర్- మాసాన్‌పల్లి, సిర్గాపూర్-వాసర్ గ్రామాల మధ్యన వంతెనల నిర్మాణాల వద్ద తాత్కాలికంగా నిర్మించిన మళ్లింపు దారులు కోతకు గురయ్యాయి. దీంతో ఈ మార్గాల్లో రాకపోకలు స్తంభించడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కల్హేర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని వర్షమాపినిలో 151.1 మిల్లీ మీటర్లుగా వర్షం నమోదైంది. వాగులు వంకల్లో వరద నీరు చేరి పొంగిపొర్లాయి. మూడుగుంటల్- సంజీవన్‌రావుపేట్ గ్రామాల మధ్యన సల్పల వాగుపైన పాత వంతెనను కూల్చి కొత్తది నిర్మిస్తుండడంతో పక్క నుంచి మళ్లింపు దారి ఏర్పాటు చేశారు. ఆదివారం కురిసిన వర్షానికి ఈ మళ్లింపుదారి కొట్టుకుపోవడంతో కల్హేర్- మాసాన్‌పల్లి, మూడుగుంటల్- సంజీవన్‌రావుపేట్‌ల మీదుగా రెండు మార్గాల మీదుగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సిర్గాపూర్- వాసర్ గ్రామాల మధ్యన వాగుపైన వంతెనను నిర్మించడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దారి కొట్టుకపోయింది. సిర్గాపూర్ గ్రామంలో ఆదివారం వారాంతపు సంత కావడంతో సిర్గాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సింగార్‌బొగుడ, మంగళ్‌తండా, రాజేశ్వర్‌తండా, సర్పంచితండా, వాసర్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



కల్హేర్-మాసాన్‌పల్లి గ్రామాల మధ్యన నిర్మించిన మళ్లింపుదారి కోతకు గురైందిలా

కూలిన ఇళ్లు...

కల్హేర్: శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాగధర్ మట్రోనికుంట గిరిజన తండాకు చెందిన విస్లావత్ బుజ్జిబాయి ఇల్లు వెనుక భాగం కూలింది. పెద్దశబ్దం రావడంతో ఒక్కసారిగా ఇంటియజమాని పిల్లతో ఇంట్లో నుంచి భయటకు పరుగెత్తారు. తండావాసులు సాయంతో మిగతా భాగం కూలకుండా కర్రల సాయంతో నిలువరించినట్లు తెలిపారు. కల్హేర్, నాగధర్ గ్రామాల్లోనూ రెండు ఇళ్లు కూలినట్లు తెలిసిందని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.



నాగధర్ తండాలో వర్షానికి కూలిన ఇల్లు

నగదు రహితం.. అమలైతే ప్రయోజనం

(మొదటిపేజీ తరువాయి) అడుగులు వేస్తోంది. వచ్చే పంచాయతీ ఎన్నికల నుంచే నగదు రహితం అమలులోకి తీసుకురావాలని యోచిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 1077 పంచాయతీలు ఉండగా జిల్లా పునర్విభజన తర్వాత 475 పంచాయతీలతో సంగారెడ్డి జిల్లా ఏర్పాటయింది. ఆయా పంచాయతీలకు 2018లో ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

వ్యయంపై నియంత్రణ

పంచాయతీ ఎన్నికలు పోటీ ఆధారంగా కొన్ని పంచాయతీల్లో సాధారణ ఎన్నికలను తలపించేలా జరుగుతున్నాయి. రూ.కోట్లలో ఖర్చుపెడుతూ బరిలో నెగ్గేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల సంఘం నుంచి వ్యయానికి సంబంధించిన పరిమితులు ఉన్నా ఇష్టారీతిగా డబ్బులు ఖర్చుచేస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. ఎన్నికల సంఘం తాజా యోచన అమలులోకి వస్తే ఇక మీదట అలా ఇష్టారీతిగా ఖర్చులు చేసేందుకు వీలుండదు. ప్రతి అభ్యర్థి ఎన్నికల వ్యయం కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాలన్న నిబంధన తీసుకురావాలని భావిస్తోంది. చెల్లింపులు నగదు రూపంలో కాకుండా నగదు రహితంగా ఉండాలని నిబంధన అమలు చేయాలని యోచిస్తోంది. దీనివల్ల ఎన్నికల వ్యయం నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది.

నిఘాతోనే సత్ఫలితాలు

'నగదు రహిత' పంచాయతీ ఎన్నికల నిర్వహణ యోచన మంచిదే అయినా అభ్యర్థులకు సంబంధించిన అన్ని బ్యాంకు ఖాతాలపైనా నిఘా ఉంటేనే సత్ఫలితాలు ఉంటాయి. ఎన్నికల సందర్భంగా ప్రత్యేక ఖాతా తెరిచిన అభ్యర్థులు ఎన్నికల వ్యయానికి సంబంధించిన అన్ని చెల్లింపులకు అదే ఖాతాను వినియోగించేలా చూడాలి. దీనివల్ల అభ్యర్థి ఎన్నికల ఖర్చు ఎంత అనేది స్పష్టంగా తెలిసే అవకాశం ఉంటుంది. ప్రత్యేక ఖాతాను తెరిచి, ఇతర ఖాతాలనుంచి నగదు ఉపసంహరిస్తే ఎన్నికల వ్యయం నియంత్రించాలన్న లక్ష్యం నీరుగారుతుంది.

★ జిల్లాలో మొత్తం పంచాయతీలు: 475
★ 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా గ్రామీణ జనాభా: 12,06,996
★ స్త్రీలు: 5,92,354 పురుషులు: 6,14,642

కరవు సీమకు... గోదావరి జలాలు

(మొదటిపేజీ తరువాయి) కాలువలను తవ్వుతారు.

ప్రజాభిప్రాయ సేకరణ...

ఈ కాలువల నిర్మాణాలకు సంబంధించి అవసరమైన భూములను సేకరించేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. సర్వే సంఖ్యల వారీగా అన్ని వివరాలనూ సిద్ధం చేస్తున్నారు. 19వ ప్యాకేజీలో పూర్తి చేసే కాలువల ద్వారా రెండు జిల్లాల్లోని 1.17 లక్షల ఎకరాలకు సాగునీరందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా సంగారెడ్డి జిల్లాలోని 11 మండలాల్లోని 1.86లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ప్యాకేజీ 19కి సంబంధించి పర్యావరణ బహిరంగ విచారణను ఈనెల 23న నారాయణఖేడ్‌లోని 'మా' ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11గంటల నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

చాకరిమెట్ల, చిన్నగొట్టిముక్ల (శివ్వంపేట): శ్రావణమాసంలో చివరి ఆదివారం, మాస శివరాత్రి సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్లలో వెలిసిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి 1,116 నాగవల్లి దళార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దేవదత్తశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. విశాలమైన సత్యనారాయణస్వామి వ్రత మండపంలో సామూహిక వ్రతాలు చేపట్టారు. ప్రభురాజ శర్మ, దేవీప్రసాద్ శర్మ తదితరులు ఉన్నారు.



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

నిధులు లేక నిస్సహాయత!

(మొదటిపేజీ తరువాయి) ఇవ్వకుండా నేరుగా పంచాయతీలకు ఇస్తోంది. భూముల క్రయ విక్రయాల విషయంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఆదాయం కూడా అదే తీరున ఉంది. అయితే ఆయా స్టాంప్ డ్యూటీ నిధులు రాకపోవడంతో మరింత ప్రభావం పడింది. 2014-18 వరకు కేవలం స్టాంప్ డ్యూటీ బకాయిలు రూ.11.97 కోట్లు పేరుకుపోయాయి.

పనులు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఇసుక, కంకర, మట్టి, ఇతర మైనింగ్ పరిశ్రమల నుంచి రవాణా, తయారు చేసిన వాటికి ప్రభుత్వానికి సంబంధిత నిర్వాహకులు పన్నులు జమ చేస్తారు. వాటిని ప్రభుత్వం ఖజానాలో వేసుకున్న అనంతరం తిరిగి జడ్పీకి ఇవ్వాల్సినవి ఇవ్వడం లేదు. వాస్తవానికి మూడు నెలలకోసారి నాలుగు విడతలుగా జిల్లా పరిషత్‌కు నిధులు కేటాయించాలి. వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, తాగునీటికి కేటాయిస్తారు. 30 శాతం సాధారణ పనులకు, 15 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు, 15 శాతం మహిళా శిశు సంక్షేమం, 14 శాతం మంచినీటి వినియోగం, 16 శాతం కార్యాలయంలో ఖర్చులు, సామగ్రికి, 4 శాతం విపత్తులు, వరదలు వస్తే వినియోగించాలి. అయితే నిధులు లేమి వల్ల, పనులు లేక ప్రజాప్రతినిధులు, అధికారులు మల్లగుల్లాలు పడాల్సి వస్తోంది.



జడ్పీ కార్యాలయం

★ పల్లెల్లో పాఠశాల, అంగన్వాడీ, సామాజిక తదితర ప్రభుత్వ భవనాలు, సీసీ రహదారులు, మురుగు కాల్వలు, మట్టిదారులు, ప్రహరీలు, ఇతర తాగునీటి అవసరాలకు ఈ నిధులను వెచ్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం కనీసం పారిశుద్ధ్య నిర్వహణకు తమ వద్ద నిధులు లేవని, గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఉందని జడ్పీటీసీలు వాపోతున్నారు. పలుసార్లు సమావేశాల్లోనూ ప్రస్తావించినా ప్రయోజనం లేదని పేర్కొంటున్నారు. ఈ విషయమై పలుసార్లు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లామని జడ్పీ అధ్యక్షురాలు రాజమణి పేర్కొంటున్నారు.

ఇతర శాఖలకు మళ్లిస్తున్నారు: శ్రీకాంత్ గౌడ్, జడ్పీటీసీ, పటాన్‌చెరు



జడ్పీకి రావాల్సిన సీనరేజి నిధులను ఇవ్వడం లేదు. జిల్లాలో వివిధ పన్నుల రూపంలో వచ్చే నిధులను ప్రభుత్వం తన ఖజానాలో జమ చేయించుకుంటోంది. వాటిని జడ్పీకి ఇవ్వకుండా మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ తదితర పథకాలకు మళ్లిస్తోంది. గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదని ప్రకటనలు చేస్తున్న అధికార పార్టీ నాయకులు, అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా జడ్పీకి నిధులు ఎందుకు కేటాయించడం లేదు. రహదారులు, భవనాల అభివృద్ధి అంటూ పేర్కొంటున్నారు. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకు 50 శాతం నిధులు మళ్లిస్తున్నారు. అధికార యంత్రాంగం ఆ రెండు నియోజవర్గంలోనే గ్రామ, రాష్ట్ర స్థాయిలోనే పనులు చేసుకునేలా చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం

–రవి, ఉమ్మడి జిల్లా, జడ్పీసీఈవో, సంగారెడ్డి



సమైక్య రాష్ట్రంలో బకాయి ఉన్న నిధులు జడ్పీకి వస్తాయో రావో తెలియదు. 2014 నుంచి రావాల్సిన బకాయిలపై ఉన్నతాధికారులకు గతంలోనే లేఖల ద్వారా విన్నవించాం. వారి నుంచి ఇప్పటి వరకు సమాచారం లేదు. నిధుల సమస్య జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. ప్రభుత్వం కేటాయింపులు చేస్తే దానికి అనుగుణంగా కార్యాచరణ చేపడతాం.

తేనె పట్టు.. లాభాల కొట్టు

● సునాయాసంగా పెంపకం ● అభ్యున్నతి సాధిస్తున్న అన్నదాతలు

న్యూస్‌టుడే, జహీరాబాద్

పూలు పూసే మొక్కలు చాలా వరకు వాటి సంతతిని అభివృద్ధి చేసుకుంటాయి. పుష్పం కాయగా మారాలంటే ఫలాధికరణ చెందాలి. ఇలా ఫలాధికరణకు దోహదకారుల్లో గాలి, కీటకాలల్లో సీతాకోక చిలకలు, తేనెటీగలు ముఖ్యమైనవి. తేనెటీగల పెంపకం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని జహీరాబాద్ శివారులోని కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్తలు జి.భార్గవి, సస్యరక్షణ శాస్త్రవేత్త జి.శైలజ పేర్కొంటున్నారు. ఇటీవల ప్రపంచ తేనెటీగల దినోత్సవాన్ని పురస్కరించుకుని తేనెటీగలు పెంచే పద్ధతులు, వాటి ద్వారా పెంపకం దారులకు కలిగే ప్రయోనాలపై రైతులకు అవగాహన కల్పించారు. వీటి పెంపకం, మార్కెటింగ్ తదితర అంశాలపై 'న్యూస్‌టుడే' కథనం.

తేనెటీగల పెంపకం

● తేనెటీగల పెంపకానికి శారీరక శ్రమ, అధిక పెట్టుబడి అవసరం లేదు. దీన్ని ఎవరైనా చెపట్టే చిన్నపాటి పరిశ్రమగా చెప్పుకోవచ్చు.
● వీటి పెంపకానికి అవసరమైన పెట్టె, ఫ్రేముల కోసం రూ.7500ల వరకు ఖర్చవుతాయి. దీనితో సంవత్సరానికి సుమారుగా 40 నుంచి 50 కిలోల తేనె తీయవచ్చు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం కిలో తేనెకు రూ.300ల నుంచి రూ.400ల చొప్పున అమ్మినా రూ.20 వేల వరకు రాబడి వస్తోంది.
● రైతులకు భూమి లేకున్నా వీటిని పెంచుకోవచ్చు.
● వీటిల్ల వ్యవసాయ పనులకు ఎలాంటి ఆటంకాలు ఎదురవవు.
● దీని ద్వారా రైతుకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది.
● తేనె ఎన్నో గృహవైద్యాలకు ఉపయోగపడుతుంది.
● దీనిని నిల్వ చేయడం, అమ్మకం సులువు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు...

ఆసక్తి ఉన్నవారికి ఉచిత శిక్షణ

– భార్గవి, కేవీకే శాస్త్రవేత్త



తేనె టీగల పెంపకం ద్వారా అటు రైతులకు ఆర్థిక వెసులుబాటుతోపాటు ఆరోగ్యానికి అనేక లాభాలు ఉంటాయి. ముఖ్యంగా ప్రస్తుతం అత్యధిక మందిని వేధిస్తున్న గ్యాస్ట్రిక్ అల్సర్, మలబద్ధకం, నిద్రలేమి, నరాల బలహీనత, చెవిపోటు, రక్తపీడనము, కామెర్లు, జలుబు తదితరాలను తగ్గించడానికి తేనె ఎంతో ఉపయోగపడుతుంది. 100 గ్రాముల తేనెలో విటమిన్ ఈ, కే తోపాటు కెరోటిన్లు, బీ-1, బీ-2, బీ-3, బీ-5, బీ-12లతో పాటు శరీరానికి అవసరమైన కార్బోహైడ్రేడ్‌లు, ఖనిజ లవణాలుంటాయి. ఆసక్తి ఉన్న రైతులు కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నారు.



వృత్తిలో సహకారం.. ప్రవృత్తిపై మమకారం

● కళారంగంలో రాణిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

న్యూస్‌టుడే, ఝరాసంగం

వృత్తిరీత్యా ప్రభుత్వ వీరు ఉద్యోగులు. పాటలు పాడుతూ సమాజానికి చేతనైనంత సహాయం(సేవ) చేయాలనే అకాంక్షతో ముందుకు సాగుతున్నారు. వారికి చిన్నప్పటి నుంచే పాటలు పాడటమంటే అమితాసక్తి. వీరంతా ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. దినమంతా ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ సెలవులు, తీరిక సమయాల్లో గణేశ్ ఉత్సవాలు, శ్రీ కృష్ణ జన్మాష్టమి, దసరా, బసవ జయంతి, ఉగాది, అంబేడ్కర్, గాంధీజీ, నెహ్రూ జయంతి, పాఠశాల, మండల, జిల్లాస్థాయిల్లో నిర్వహించే పలు సంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సభలు, వివాహాది శుభకార్యాల వేడుకల్లో పాల్గొని సంగీత కచేరీలు ఉచితంగా చేస్తుంటారు. తద్వారా విద్యార్థులతోపాటు పలువురికి దేశ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని వారు పేర్కొంటున్నారు. ఝరాసంగం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న రాంచందర్‌భీమ్‌వంశీ, న్యాల్‌కల్ మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌జోషి, జహీరాబాద్ మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ సహాయకునిగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వర్‌రావులపై ప్రత్యేక కథనం.

సామాజిక గీతాలతో అవగాహన



విద్యార్థి దశనుంచే పాటలు పాడటం అలవాటు చేసుకున్నా. 1989లో రాయికోడ్ మండలం పీపడ్‌పల్లి పాఠశాలలో మొదటగా ఉపాధ్యాయునిగా వీధుల్లో చేరా. గత 32 ఏళ్లుగా సామాజిక గీతాలు, దళిత ఉద్యమగీతాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, గుట్కా, మట్కా, మద్యపానం, విద్యార్థి ప్రబోధగీతాలు, తత్వాలు, అంటరానితనం, తల్లిదండ్రులు, గురువులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, తెలంగాణ యాస భాషాల్లో పాటలు ఆలపిస్తున్నా. అంతేకాకుండా పాటలు నేర్చుకోవాలనే తపన ఉన్నవారికి ఉచింతంగా నేర్పిస్తున్నా. – రాంచందర్‌భీమ్‌వంశీ, ఉపాధ్యాయుడు, ఝరాసంగం

పాటలంటే అమితాసక్తి



సంగీత, పౌరోహిత్య గురువు శ్రీ రాంభట్‌జోషివద్ద సంగీతం, పౌరోహిత్యం నేర్చుకున్నా. చిన్నప్పటి నుంచే సంగీతంపై ఆసక్తి ఎక్కువ. గురువు స్ఫూర్తితో జహీరాబాద్ పరిసర ప్రాంతాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాల్లో తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో సంగీత కచేరీల్లో పాల్గొంటున్నా. 1992లో ధనసిరి పాఠశాలలో ఉద్యోగంలో చేరారు. కార్యాలయ విధులు నిర్వహిస్తూనే సంగీత కచేరీల్లో పాల్గొంటున్నా. సంగీతం కోసం ఎవరైనా ముందుకు వస్తే నేర్పించేందుకు సిద్ధంగా ఉన్నా.

– శ్రీనివాస్‌జోషి, జూనియర్ సహాయకుడు, న్యాల్‌కల్

రెండు భాషాల్లో ప్రావీణ్యం



మాది కోహీర్ మండలం. చిన్నప్పటి నుంచే సంగీతంపై ఆసక్తి ఉంది. వీటితోపాటు చదరంగం, చిత్రలేఖనంలో ప్రావీణ్యం సంపాదించా. 1998లో కోహీర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూడీసీగా ఉద్యోగంలో చేరా. సభలు, భజనలు, పండగ ఉత్సవ కార్యక్రమాల్లో తెలుగు, హిందీ భాషల్లో దేశభక్తి, సంప్రదాయ పాటలు పాడుతున్నా. జహీరాబాద్ పరిసర ప్రాంతాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాల్లో నిర్వహించే కచేరీలకు తరచుగా శ్రీనివాస్‌జోషితో కలిసి వెళ్తుంటా.

– రాజేశ్వర్‌రావు, జూనియర్ సహాయకుడు, జహీరాబాద్

స్వయం సహాయకులకు ఆర్థిక భరోసా



జిల్లాలో 740 మందికి లబ్ధి ● ఏటా రూ.200 కోట్ల రుణాల పంపిణీకి కృషి



మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన వీఓఏలు (పాతచిత్రం)

న్యూస్‌టుడే, మనూరు

స్వయం సహాయక(పొదుపు) సంఘాలకు అండగా నిలుస్తున్న గ్రామ సహాయకుల (వీవోఏ)కు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. వీరికి గౌరవ వేతనాలు అందజేసి ఆర్థిక భరోసా కల్పించనుంది. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరు నెలకు రూ.5 వేలు వేతనం అందుకోనున్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని 740 మంది వీవోఏలకు ప్రయోజనం చేకూరనుంది. ఇన్నాళ్లు పొదుపు సంఘాల ద్వారా అందించే అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న వీవోఏలు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంధానకర్తలుగా కీలక బాధ్యతలు

సంగారెడ్డి జిల్లాలో 740 గ్రామైక్య మహిళా సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 21,309 స్వయం సహాయక పొదుపు సంఘాలు పని చేస్తున్నాయి. సుమారు 2,32,115 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఏటా బ్యాంకుల నుంచి రూ.200 కోట్ల రుణాలు వారికి అందిస్తున్నారు. గ్రామైక్య సంఘాల పనితీరు మెరుగుపడటం, పొదుపు లావాదేవీల పుస్తకాలు రాయడం, అర్హత ఉన్న స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సామాజిక పెట్టుబడి నిధి పథకం ద్వారా రుణాలు అందేలా చూడటం, రుణాలు తీసుకొన్న వారి నుంచి నెలనెలా కిస్తులు కట్టించడం, మహిళా సంఘాలకు, బ్యాంకర్లకు సంధానకర్తలుగా వ్యవహరించడం వీవోఏల పని. ఇదివరకు వీరికి వేతనం అంటూ లేకపోవడంతో పలువురు పనిపై శ్రద్ధ పెట్టలేదు. ప్రస్తుతం నెలనెలా రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేలు, గ్రామైఖ్య సంఘాల ద్వారా రూ.2 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తారు.

సీఏ నుంచి వీవోఏలుగా మార్పు

గత ప్రభుత్వ హయాంలో సీఏగా ఉన్న వీరిని తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత వీవోఏలుగా మార్చింది. ప్రస్తుతం వీరిని గ్రామ సంఘం సహాయకులుగా పిలుస్తారు. సంఘాలను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వారికి గత మార్చిలో వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. ఆ ఉత్తర్వులు జారీ చేయడంతో ఏప్రిల్ 1 నుంచి రూ.5 వేలు వేతనాలను వీవోఏలు అందుకోనున్నారు.

కుటుంబానికి అండ లభించనుంది

– బుజ్జమ్మ, వీవోఏ, రాయిపల్లి



ఏళ్లుగా రాయిపల్లి వీవోఏగా విధులు నిర్వహిస్తున్నా. వేతనం తక్కువే అయినా ఆర్థిక అవసరాల కోసం పనిచేశా. ఇప్పుడు ప్రభుత్వం బాధ్యతను గుర్తించి వేతనాలు పెంచడం వల్ల కుటుంబానికి అండ లభించినట్లయింది. మరింత నిబద్ధతతో పని చేస్తా. పొదుపు సంఘం మహిళల్లో చైతన్య తీసుకొస్తాం. క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడంతోపాటు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సభ్యులు క్రమం తప్పకుండా కట్టించేలా దృష్టి సారిస్తా.

వంద శాతం వసూలు...

– శాంతప్ప, వీవోఏ, గొందేగామ్




బ్యాంకు ద్వారా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను వంద శాతం రికవరి అయ్యేలా పని చేస్తాం. ప్రభుత్వం గౌరవ వేతనం పెంచడంతో పని భారం పెరిగింది. కష్టపడి సంఘాల అభివృద్ధిలోకి తీసుస్తాం. ఎన్నో ఏళ్లుగా పని చేసినందుకు ఫలితం దక్కింది.

ఇకపై జీవో ప్రకారం చెల్లింపులు

– సిద్దారెడ్డి, ఏపీడీ

వీవోఏలకు ప్రతి నెల రూ.3 వేలు చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మిగతా రూ.2 వేలు గ్రామైఖ్య సంఘం ద్వారా తీసుకోవాలి. వీవోఏలు సంఘాల అభివృద్ధితోపాటు తీసుకున్న రుణాల రికవరీ వందశాతం ఉండేలా చేస్తాం. ప్రతిఏటా జిల్లాలో రూ.200 కోట్ల రుణ సదుపాయం కల్పిస్తున్నాం.

ఒక వ్యక్తి చిన్నవాడా, పెద్దవాడా లేక ఒక ప్రదేశం చిన్నదా.. పెద్దదా అనేది ప్రామాణికం కాదు. ప్రపంచమే ఓ కుగ్రామంగా మారుతున్న నేటి రోజుల్లో వ్యక్తి చిన్నవాడైనా, ప్రదేశం మారుమూల ప్రాంతమైనా అక్కడ చేపట్టే పని, ప్రతిభ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తెస్తాయి. తాము చేసే మంచి పనులు ఇతరులకు ప్రేరణ ఇవ్వడమే కాకుండా, పలువురి ప్రశంసలు అందుకుంటాయి. ఇందుకు జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంగా వెలువడుతున్న 'మంజీర జర్నల్' (పత్రిక)కు లభించిన గుర్తింపే నిదర్శనంగా చెప్పవచ్చు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగేళ్ల కిందట ప్రారంభించిన 'మంజీర జర్నల్'కు కేంద్ర ప్రభుత్వం అందించే యూజీసీ, అంతర్జాతీయ సంస్థ ప్రకటించే ఐఎస్ఎస్ఎన్ గుర్తింపు సంఖ్య లభించింది. ఈ ప్రయత్నాన్ని ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అతి తక్కువ సమయంలోనే ఈ గుర్తింపును సొంతం చేసుకున్న తీరుపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న కథనం.





'మంజీర జర్నల్'కు మకుటం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంచికకు అరుదైన గౌరవం ● అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సంఖ్య కేటాయింపు ● నాలుగేళ్ల ప్రయత్నానికి దక్కిన ఫలితం

న్యూస్‌టుడే, జహీరాబాద్

ప్రస్తుతం విద్యారంగంలో విపరీతమైన పోటి పెరిగిపోయింది. ఏదైనా చిన్నపాటి ఉద్యోగం సాధించాలంటే రకరకాల పరీక్షలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ సంవత్సరం జనవరి 10న కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ ప్రకారం విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులుగా ఎంపిక కావాలన్నా, ఆయా కళాశాలల్లోని అధ్యాపకులు పదోన్నతులు పొందాలన్నా, పీహెచ్‌డీ పూర్తిచేయాలన్నా యూజీసీ గుర్తింపు పొందిన జర్నల్‌లో కనీసం రెండు పరిశోధన పత్రాలు(వ్యాసాలు) ప్రచురితం కావాల్సిందే. ఇలాంటి జర్నల్స్(పత్రికలను) దేశంలోని వివిధ ప్రాంతాల్లో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలు రూపొందిస్తున్నప్పటికీ సంగారెడ్డి జిల్లాలోని మారుమూల జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాలుగేళ్ల కిందట ప్రారంభించిన ఈ ప్రయత్నానికి గుర్తింపు రావటం అధ్యాపకులు గర్వకాణంగా చెప్పుకుంటున్నారు. జిల్లాలో మంజీర నది ఉన్నందున దీనికి 'మంజీర జర్నల్'గా నామకరణం చేశారు. దేశవిదేశాల్లోని మేధావులు, పరిశోధకులు, అధ్యాపకులు, ఆచార్యులు సామాజిక శాస్త్రవేత్తలు పంపించే పరిశోధన పత్రాలు(వ్యాసాలను) ఎంపిక చేసి ప్రతి ఆరు మాసాలకోసారి ఈ పత్రికలో ముద్రిస్తారు.



ఎంపికలో 'ప్లైగరిజం' కీలకం

దేశవిదేశాల నుంచి వచ్చిన వ్యాసాలల్లో అర్హత పొందిన వాటిని ఎంపిక చేయడానికి మనదేశంతో పాటు విదేశాలకు చెందిన మొత్తం 25 మందితో కూడిన కమిటీని ఉంటుంది. అయితే కొందరు ఈపాటికే వచ్చిన పత్రికల్లోని వ్యాసాలను కాపీ కొట్టడమో లేదా ఎలాగైనా తమవారి వ్యాసాలు ప్రచురణకు ఎంపిక చేయాలని ఈ కమిటీలోని సభ్యులు పక్షపాతంగా వ్యవహరించేందుకు వీలు లేకుండా 'ప్లైగిరిజం' అనే యాప్‌ను రూపొందించారు. శాస్త్రవేత్తల నుంచి వచ్చిన పరిశోధన పత్రాల(వ్యాసాలు)ను 'ప్లైగిరిజం' అనే యాప్‌తో అనుసంధానం చేస్తారు. దీనివల్ల ఈ పాటికే వచ్చిన వ్యాసాలు మళ్లీ వస్తే ఇది గుర్తిస్తుంది. గతంలో వచ్చిన వ్యాసాలు, ప్రస్తుతం ఉన్న వ్యాసాల్లో 30 శాతం కంటే అధికంగా అవే పదాలుంటే వాటిని అనర్హతగా ప్రటిస్తారు. ఇలాంటి వ్యాసాలతో కూడిన ఈ పత్రికను ప్రతి ఆరు నెలలకోసారి ముద్రించి దేశ, విదేశాల్లోని వివిధ కళాశాలల్లోని గ్రంథాలయాలకు పంపింస్తారు. వీటిని అంతర్జాలంలో కూడా పొందవచ్చు.



జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

యూజీసీ గుర్తింపుతో ఉత్సాహం

జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు, ఉపన్యాసకుడు మల్లికార్జునరావులు కలిసి 2014లో ఈ ప్రయత్నాన్ని ప్రారంభించారు. దాదాపు నాలుగేళ్లుగా సాగిస్తున్న వీరి ప్రయత్నానికి కేంద్ర ప్రభుత్వ ఆదీనంలోని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) గుర్తింపు ప్రత్యేక నంబర్: 64636ను కేటాయించింది. ఇంటర్‌నేషనల్ స్టాండెడ్ సీరియల్ నంబర్ (ఐఎస్ఎస్ఎన్)అనే సంస్థ కూడా ప్రత్యేక సంఖ్యను కేటాయించింది. ఈ నంబర్లు ప్రపంచ వ్యాప్తంగా ఇతరులెవ్వరికీ ఉండవు.

గర్వకారణంగా ఉంది

– డాక్టర్ శ్రీనివాసరాజు, ప్రిన్సిపల్, ఎడిటర్ మంజీరా జర్నల్



మారుమూల ప్రాంతంలోని కళాశాల నుంచి కూడా మంచి ప్రయోగాలు చేయాలనే తపనతో ఈ ప్రయత్నాన్ని ప్రారంభించాం. ప్రారంభంలో భయంగా ఉన్నప్పటికి స్థానిక అధ్యాపకుల కృషి ద్వారా సఫలీకృతులమయ్యాం. నేడు దేశ, విదేశాల్లో గుర్తింపు రావటం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాం.

దిక్సూచిగా పనిచేస్తుంది

– డాక్టర్ మల్లికార్జురావు



దేశవిదేశాల్లోని మేధావుల ద్వారా సేకరించిన వ్యాసాలను ఇందులో ప్రచురించడం ద్వారా నేటితరం వారికి దిక్సూచిగా పనిచేస్తుంది. ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ప్రకారం కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అధ్యాపకులు, కొత్తగా ఉద్యోగాలు పొందాలనుకునేవాళ్లకు ఇంది ఉపయోగపడుతుంది. ప్రసుత్తం వచ్చిన గుర్తింపు మా బాధ్యతను మరింత పెంచింది. ఇదే ఉత్సాహంతో పనిచేసి మరింత ముందుకెళ్తాం.

నల్లవాగుకు జలసిరి

నిండుకుండను తలపిస్తున్న నల్లవాగు ప్రాజెక్టు



నల్లవాగు ప్రాజెక్టు ఎగువ భాగంలో శనివారం రాత్రి కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈ సూర్యకాంత్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1493 అడుగులు(746.13 మిలియన్ క్యూబిక్ అడుగులు) కాగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1490 అడుగుల(566.33 మిలియన్ క్యూబిక్ అడుగుల)వరద నీరు వచ్చి చేరింది. వానాకాలం ప్రారంభం నుంచి కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి 1488 అడుగుల నీరు వచ్చిచేరగా ఇటీవల నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. ప్రాజెక్టు అలుగుపై నుంచి పొంగిపోర్లాలంటే మరో మూడడుగుల నీరు అవసరం ఉంది. ప్రాజెక్టు ఎగువ భాగంలో చిన్నచిన్న వాగులనుంచి వరద ఈ వాగులోకి వచ్చిచేరుతుండటంతో రెండుమూడు రోజుల్లో పొంగిపోర్లే అవకాశాలు ఉన్నాయని స్థానిక అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు ఒక్కసారి పొంగిపోర్లినా... ఆయకట్టులో పూర్తిస్థాయి పంటలు పండుతాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పొంగుతున్న మత్తళ్లు, వాగులు!


శనివారం రాత్రి కురిసిన భారీవర్షానికి మండలంలోని వాగులు, వంకలు అన్ని వరదనీటితో పొంగి పారుతున్నాయి. ఇప్పటివరకు వట్టిపోయిన చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. నాగదర్ గ్రామశివారులోని పెద్దమత్తడి, మొండిమత్తడి, దేవునిపల్లి మత్తళ్లు పొంగి ప్రవహిస్తున్నాయి. నాగదర్‌మీదుగా మీర్‌ఖాన్‌పేట్ వాగు, కల్హేర్ మహారాజుల వాగులు ఉధృతంగా పారుతున్నాయి. ఈ ఏడాది రాత్రి కురిసిన వర్షమే పెద్దవర్షంగా రైతులు చెప్పుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, కల్హేర్



పొంగి పొర్లుతున్న నాగదర్ మొండిమత్తడి

నాణ్యత.. నిర్దేశించిన పరిమాణం.. సరసమైన ధర... ఇవేవీ... రైలు ప్రయాణికులకు విక్రయించే ఆహార పదార్థాల్లో కనిపించడం లేదు. కాంట్రాక్టు దక్కించుకున్న సరఫరాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు కొందరు అనధికారికంగా రైళ్లలో ప్రవేశించి నాణ్యతలేని ఆహారాన్ని అందించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రయాణికులకు అనారోగ్యాన్ని మిగులుస్తున్నారు. ఈ అంశంపై 'కాగ్' తప్పు పట్టాక రంగంలోకి దిగిన రైల్వే అధికారులకు అనేక విస్తుపోయే పరిస్థితులు కనిపించాయి.



తినడం కష్టం... తిన్నామా నష్టం!

- రైళ్లలో ఆహారమా మజాకానా
- నాణ్యత లేమి... కల్తీలమయం
- తనిఖీల్లో తేలుతున్న నిజాలు

ఈనాడు - హైదరాబాద్

ఆహార సరఫరా తీరుపై రైల్వే అధికారులు జులై 26 నుంచి ఆగస్టు 16వరకు వివిధ రైల్వే స్టేషన్లు, రైళ్లలో తనిఖీలు చేపట్టారు. దాదాపు వెయ్యి కేసులు నమోదు చేశారు. వీటిలో సగానికి పైగా సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలోనివే. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగిన ప్రతి బండినీ పరిశీలించగా ప్రయాణికులు ఎలా దోపిడీకి గురయ్యారో తేలింది. పరిశుభ్రత పాటించకపోవడం, పరిమాణం తక్కువగా ఉండటం, నాణ్యత లేకపోవడం.. పాడైపోవడానికి సిద్ధంగా ఉన్న ఆహారం అందించడం... ఇలా గుత్తేదారులు నిబంధనలు ఉల్లంఘించిన తీరు కళ్లకు కట్టాయి. ఇవన్నీ ఒకెత్తయితే ఎవరుపడితే వారు ఇళ్లలో, కాకా హోటళ్లలో వండిన పదార్థాలను తీసుకువచ్చి అమ్మేస్తున్నారు. అటు అమ్మకం దారులకు, ఇటు గుత్తేదారులకు రూ. లక్షల్లో అధికారులు జరిమానాలు విధించారు.

నిర్లిప్తంగా వ్యవహరిస్తే అంతే..

రైళ్లలో సరఫరా అవుతున్న ఆహారం గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని కొంతమంది సరిపుచ్చుకుంటారు. రోజూ తింటామా? ప్రయాణం సాఫీగా సాగిపోతే అదే పదివేలు అని భావిస్తుంటారు. సరిగ్గా ఇటువంటి నిర్లిప్త ధోరణే ఇప్పుడు రైళ్లలో భోజనాలు పెట్టేవారికి వరమవుతోంది. నాసిరకం ఆహారం ప్రయాణికులకు అందుతోంది. జులై 25న రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు ఇటువంటి ఆహారంతో సర్దుకుపోలేదు. హజ్రత్ నిజాముద్దీన్(దిల్లీ) నుంచి బెంగళూరు వెళ్లే ఈ ప్రయాణికులు సికింద్రాబాద్‌లో రైలును గంటసేపు ఆపి ఆందోళనకు దిగారు. అధికారులు రంగంలోకి దిగి సర్దుబాటు చేశారు. ఇటీవల కాచిగూడ రైల్వే స్టేషన్‌లో క్యాంటీన్‌లో కొన్న ఆహారంలో బొద్దింక కనిపించింది. ఈ నేపథ్యంలో ఆహారం ఎలా ఉండాలనేదానిపై అందరిలో చర్చ జరుగుతోంది. దాదాపు 97 పదార్థాలకు స్టేషన్లలో విక్రయించాల్సిన ధర, రైళ్లలో అందించాల్సిన ధరలను రైల్వేబోర్డు నిర్ణయించింది. వాటిలో కొన్నింటి పరిమాణం, ధరలు ఇలా ఉన్నాయి. వీటికి 18 శాతం జీఎస్టీ వర్తిస్తుంది.

934
దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 22 రోజుల్లో నమోదైన కేసులు

రూ.7.30 లక్షలు
అమ్మకందారులకు విధించిన జరిమానా

రూ.9.04 లక్షలు
గుత్తేదారులకు విధించిన జరిమానా

పరిమాణం	క్యాంటీన్‌లో ధర(రూ.లలో)	రైళ్లలో
2 ఇడ్లీలు(60గ్రా),చట్నీ/సాంబారు(40గ్రా)	12.00	14.00
2 మసాలావడలు(60గ్రా), చట్నీ(40గ్రా)	16.00	18.00
లీటరు తాగునీటి సీసా	15.00	15.00
రెండు వడలు(60గ్రా), పెరుగు(100గ్రా)	14.00	16.00
రెండు సమోసాలు(60 గ్రా.), సాస్/చట్నీ	16.00	18.00
టమోటా సూప్(150ఎంఎల్), మిరియాల పొడి	15.00	18.00
వెజ్ బిర్యానీ/పలావు (200గ్రా)	42.00	49.00
200 గ్రాముల వెజ్ ఫ్రైడ్‌రైస్	32.00	37.00

ఫిర్యాదు చేయండి


రైల్వే బోర్డు నిర్ణయించిన ధరలు నాలుగైదేళ్ల క్రితానివి అయినప్పటికీ.. ఆ నిబంధనల ప్రకారమే ఆహారం సరఫరా చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. రెట్టింపు ధరలకు అమ్మేస్తున్నారు. ఫిర్యాదులందినా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ప్రతి ఆహార ప్యాకెట్‌పైనా సరఫరా చేస్తున్న సంస్థ పేరు.. రిజిస్టర్ నంబరు.. ఎన్ని గ్రాములు ఉంది తదితర వివరాలతో పాటు తేదీ ఉండాలి. సరఫరా కాంట్రాక్టు పొందిన సంస్థలు కొంతమంది ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సహించగా.. మరికొందరు అనుమతి లేకుండానే విక్రయిస్తున్నారు. ఇలాంటి సమస్యలపై 1800111321, 18004255090 టోల్‌ఫ్రీతోపాటు 138 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

పది రోజుల్లోనే కట్టేశారు!

- ఒలిఫెంటా దగ్గర మెట్రో స్టీలు వంతెన పూర్తి
- 271 అడుగుల దూరం స్పాన్ బిగింపు

ఈనాడు, హైదరాబాద్

మెట్రోరైలు పనుల్లో మరో ఇంజినీరింగ్ సవాల్‌ను నిర్మాణ సంస్థ విజయవంతంగా అధిగమించింది. ఒలిఫెంటా రైల్వే వంతెనపై మెట్రో రైలు స్టీలు బ్రిడ్జి శనివారం తెల్లవారుజామున సురక్షితంగా పట్టాలు దాటించి, స్తంభాలపై బిగించారు. నాగోల్ నుంచి మెట్టుగూడ వరకు మెట్రో రెండేళ్ల క్రితమే పూర్తయింది. అయినా సికింద్రాబాద్ వరకు అనుసంధానానికి ఒలిఫెంటా ఆర్వోబీ ప్రధాన అడ్డంకిగా ఉండేది. ఇప్పుడు వంతెన పూర్తవడంతో నవంబరు ఆఖరులో ప్రధాని చేతుల మీదుగా మెట్రో ప్రారంభించేందుకు చేస్తున్న పనులు ఊపందుకున్నాయి.



మెట్రో స్టీలు వంతెన కిందుగా వెళ్తున్న రైలు

272 అడుగులు	స్పాన్ పొడవు (ప్రధాన వంతెన)
60 అడుగులు	రహదారి నుంచి ఎత్తు
42 అడుగులు	రైలు ట్రాక్ నుంచి ఎత్తు
656 అడుగులు	స్టీలు వంతెన పొడవు
100 టన్నులు	తోసే జాక్ సామర్థ్యం
400 టన్నులు	పైకి ఎత్తే లిఫ్టింగ్ సామర్థ్యం

మెట్రో కారిడార్లలో రైల్వే లైన్లపై నిర్మించిన ఆర్వోబీలకు ఒలిఫెంటా పూర్తి భిన్నం. ఇక్కడ దాదాపు 83 మీటర్ల దూరం మధ్యలో ఎలాంటి మద్దతు లేకుండా ఆర్వోబీ నిర్మించాల్సి వచ్చింది. అందుకే స్టీలు వంతెనను ప్రతిపాదించారు. ఈ స్టీలు వంతెనను ఉత్తరప్రదేశ్ జిల్లా ఘజియాబాద్‌లో తయారు చేయించారు. అనంతరం భాగాలుగా విడదీసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ ఒలిఫెంటా బ్రిడ్జి సమీపంలోని రైల్వే స్థలంలో కొద్దినెలలుగా విడి భాగాలను కలుపుతూ వంతెన తయారు చేశారు. దీన్ని ఒలిఫెంటా బ్రిడ్జికి అటుఇటు 272 అడుగుల దూరంలో నిర్మించిన స్తంభాలపైకి సురక్షితంగా చేర్చారు. 1,100 టన్నుల బరువు, 57 అడుగుల వెడల్పు, 35 అడుగుల ఎత్తులో ఎలాంటి ప్రమాదాలకూ ఆస్కారం లేకుండా విజయవంతంగా బిగించారు. రైల్వే అనుమతి ఇచ్చిన అర్ధరాత్రి వేళల్లో కొద్ది రోజులుగా జాక్స్, క్రేన్లు, విదేశాల నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న రోలర్ల సహాయంతో అడుగు అడుగు జరుపుతూ శనివారం ప్రక్రియను పూర్తి చేశారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్తగా ఆ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

సరికొత్త రికార్డు - ఎన్వీఎస్‌రెడ్డి, ఎండీ, హెచ్ఎంఆర్

స్టీలు వంతెనలను నదులు, కొండల్లో నిర్మిస్తుంటారు. అక్కడ జన సంచారం ఉండదు కాబట్టి నిర్మాణం సులువే. రద్దీగా ఉండే సికింద్రాబాద్ వంటి చోట్ల ఎంతో క్లిష్టం. అయినా 10 రోజుల్లోనే పూర్తి చేయడం సరికొత్త రికార్డు. మరో 15 రోజుల్లో స్టీలు వంతెనను వయడక్ట్‌తో కలిపి ట్రాక్ పనులు పూర్తిచేస్తాం.

నెల రోజుల్లో గుర్తింపు కబురు?!

- వర్సిటీల్లో ముగిసిన న్యాక్‌బృందాల పర్యటన
- సానుకూలంగా సాగిన పరిశీలన
- మంచి గ్రేడ్ వస్తుందంటున్న వీసీలు



జేఎన్‌టీయూహెచ్‌లో పర్యటిస్తున్న న్యాక్ బృందం

ఈనాడు, హైదరాబాద్: జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు ఎట్టకేలకు న్యాక్ గుర్తింపు దక్కనుంది. గత కొన్నేళ్లుగా ఈ రెండు వర్సిటీలకు న్యాక్ గుర్తింపు లేని విషయం విదితమే. కారణాలు ఏమైనా ఈ విశ్వవిద్యాలయాలకు న్యాక్ గుర్తింపు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ వర్సిటీలకు ఇన్నేళ్లపాటు గుర్తింపు లేకుండా సాగడం పలు విమర్శలకు దారితీసింది. వర్సిటీతోపాటు విద్యార్థులు ఆర్థికంగా బాగా నష్టపోయారు. 2004లో జేఎన్‌టీయూకి న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్)ఏ గ్రేడ్ దక్కింది. ఆ తర్వాత 2008లో ఈ వర్సిటీ నాలుగ్గా విడిపోయింది. ఒకటి జేఎన్‌టీయూహెచ్‌గా ఆవిర్భవించింది. 2004లో దక్కిన గుర్తింపు 2009లో పూర్తిఅయింది. వర్సిటీ కొత్తగా ఆవిర్భవించిన నేపథ్యంలో మళ్లీ న్యాక్ గుర్తింపు కొత్తగా పొందాల్సి వచ్చింది. అప్పటి నుంచి గుర్తింపు పొందేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. వీసీగా ఎ.వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గుర్తింపుపై మళ్లీ దృష్టిపెట్టారు. ఆయావిభాగాల అధికారులను అప్రమత్తం చేశారు. వర్సిటీలో మౌలిక వసతులు కల్పించారు. వీటితోపాటు సీబీసీఎస్, క్రెడిట్స్ విధానాలను అమలులోకి తెచ్చారు. సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. బయోమెట్రిక్ హాజరును ఉద్యోగులకు అమల్లోకి తెచ్చారు. ఇవన్నీ గుర్తింపు పొందేందుకు కలిసొచ్చే అంశాలే. ఇదేతీరులో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గుర్తింపు పొందేందుకు పలు అంశాలు దోహదం చేస్తున్నాయి. ఓయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రామచంద్రం.. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు చాలా కసరత్తు చేశారు. శతాబ్ది ప్రారంభోత్సవాల నాటికి ఈ గుర్తింపు సాధించాలని ఎంతో ప్రయత్నం చేశారు. ఈయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత తక్కువకాలంలోనే ఈ ప్రారంభోత్సవాలు రావడంతో 'గుర్తింపు' సాధ్యంకాలేదు.

ప్రశాంతంగా మూడురోజుల పర్యటన

ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్‌ల్లో న్యాక్ బృందాలు ఈనెల 17 నుంచి మూడు రోజులపాటు విస్తృతంగా పర్యటించాయి. 17వ తేదీ ఉదయం నుంచి ప్రారంభమైన ఈ బృందాల పరిశీలన శనివారం సాయంత్రం వరకు అదే జోరుగా సాగింది. ఈ మూడు రోజుల్లో ఆయా విభాగాలను న్యాక్ బృంద సభ్యులు నిశితంగా పరిశీలించారు. జేఎన్‌టీయూహెచ్‌లో న్యాక్ బృందంలో ఉన్న ఆరుగురు సభ్యులు, ఉస్మానియాలో తొమ్మిది మంది సభ్యులున్నారు. వీరంతా పలు బృందాలుగా విడిపోయి వర్సిటీల్లోని దాదాపు అన్ని విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాలు ఎంతకాలం నుంచి వర్సిటీల్లో ఉన్నాయో ఆరా తీశారు. వాటి బడ్జెట్ వివరాలు, చేస్తున్న కార్యకలాపాలు తదితరాల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి వసతులను నేరుగా వీక్షించారు. పర్యటన ప్రారంభం నుంచి చివరి వరకు ప్రతి సంఘటనను సంబంధించి చిత్రాలు, వీడియోలను తీయించారు. మూడు రోజుల న్యాక్ బృందాల పర్యటన అంతా ప్రశాంతంగా సాగింది.

గ్రేడ్‌పై వీడని ఉత్కంఠ..

వర్సిటీల వీసీలు, అధికారులు న్యాక్ నుంచి మంచి గ్రేడ్ వస్తుందని ఆశిస్తున్నారు. ఈ గుర్తింపు నెల రోజుల్లోనే రావచ్చని పేర్కొన్నారు. న్యాక్‌లో ఏ, ఏప్లస్, ఏప్లస్‌ప్లస్ గ్రేడుల్లో ఏది దక్కుతుందో వేచిచూడాల్సిందే. ప్రస్తుతం వర్సిటీల్లోని పరిస్థితుల రీత్యా రెండు వర్సిటీలకు 'ఏ లేదా ఏ ప్లస్' గ్రేడులే దక్కవచ్చని విద్యారంగ నిపుణులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రెండు వర్సిటీల్లో చాలా దీర్ఘకాలిక సమస్యలున్నాయని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీటిపై అవి దృష్టిపెట్టలేకపోయాయని వారు పేర్కొన్నారు. ఇదిఒక్కటే మంచి గ్రేడ్‌లు దక్కేందుకు ప్రతికూల అంశమైందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు మాత్రం గ్రేడు ఏది వస్తుందనే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

సానుకూల అంశాలే ఎక్కువ..

జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు న్యాక్ గుర్తింపు దక్కే తరుణం ఆసన్నమైంది. వీటిల్లో చాలా సమస్యలకు పరిష్కారం లభించింది. నిధుల లోటు కారణంగా దీర్ఘకాలిక సమస్యలు మాత్రం అలాగే ఉండిపోయాయి. న్యాక్ బృందం వచ్చేలోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఉస్మానియా అధికారులు ప్రయత్నించినా నిధుల సమస్య వెంటాడింది. జీతాలు సకాలంలో ఇవ్వడానికే ఇబ్బందిపడిన పరిస్థితి నుంచి గట్టెక్కినా.. అభివృద్ధి పనులకు సమృద్ధిగా నిధులు లేవనే చెప్పాలి. ప్రభుత్వం ప్రకటించిన రూ. 200 కోట్లులో రూ.50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. మిగతా నిధులు వచ్చిఉంటే వర్సిటీలో మరిన్ని పనులు పూర్తయ్యేవి. శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వేసిన రహదారులు, భవనాలకు రంగులు వంటి పలు కార్యక్రమాలు న్యాక్ గుర్తింపు పొందేందుకు కలిసొచ్చాయనే చెప్పాలి. వసతిగృహాలు మెరుగుపడ్డాయి. రహదారులు, భవనాలు ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాయి.

ప్రతిభ

TENTH English

PREPOSITIONS

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company the keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)
2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.
2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.
2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. **ప్రతిపాదన (A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే □ □	5. Pay	వే □ □
2. Flute	వే □ □	6. God	వే □ □
3. Speed	వే □ □	7. Function	వే □ □
4. Heat	వే □ □	8. Dawn	వే □ □

- డీ దయామతి, హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!







హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.

చిన్నూ కబుర్లు

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందం చేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట.

ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రామూ! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్


చిలిపి ప్రశ్న


నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?







పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: ఏది భిన్నం: a చిలిపిప్రశ్న: తినలేం కాబట్టి! సరదా పదాలు: 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ

పదేళ్లుండాల్సినవి.. మూడు నెలలకే ముక్కలు..!


చౌటకూరులోని బీసీ వాడలో సీసీ రోడ్డు ఇలా..

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

• సీసీ రోడ్లకు పగుళ్లు • రూ.8.50 కోట్లతో నిర్మాణాలు
• ఉపాధిహామీ, ఎంపీ, ఏకగ్రీవ నిధులతో పనులు • చాలా గ్రామాల్లో ఇదే తీరు..

న్యూస్‌టుడే, పుల్కల్, రాయికోడ్

నిబంధనల ప్రకారం.. నాణ్యత ప్రమాణాలతో సీసీదార్లు వేస్తే కనీసం పదేళ్లు మన్నుతాయి. సాంకేతిక నిపుణులు చెబుతున్న మాట ఇది... ఇటీవల వివిధ పథకాల కింద వేసిన సీసీరోడ్లు పదేళ్లు కాదు కదా... కనీసం మూడు నెలలు ముచ్చటగా కన్పించడం లేదు. వేసిన కొద్ది రోజులకే పగుళ్లు కన్పిస్తున్నాయి. కొన్ని చోట్ల సిమెంటు పూత తొలగిపోయి కంకర తేలుతోంది. అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టాల్సిన ఉన్నా.. వారు పట్టించుకోలేదు. దీంతో గుత్తేదార్లు ఇష్టారాజ్యంగా పనులను కానిచ్చేశారు. దీంతో నిధులు భారీగా ఖర్చయినా.. లక్ష్యం నెరవేరని పరిస్థితి ఏర్పడింది. అందోలు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' పరిశీలనాత్మక కథనం.


కోర్పోల్‌లో నిర్మాణానికి వాడిన రాతిపొడి

నిబంధనలకు తిలోదకాలు

సీసీరోడ్ల నిర్మాణంలో గుత్తేదారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. రోడ్లపై స్పష్టంగా పగుళ్లు కనిపిస్తున్నా.. అధికారులు మాత్రం ఆ రోడ్లు బాగున్నాయని సమాధానం ఇస్తుండటంపై పలు గ్రామాల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రోడ్ల నిర్మాణంలో పంచాయతీరాజ్‌శాఖ సాంకేతిక సహాయకుల పర్యవేక్షణ లోపించింది. రోడ్ల నిర్మాణానికి ఎక్కడా నాణ్యమైన ఇసుక వాడలేదు. స్థానికంగా తక్కువ ధరతో లభించే ఇసుకను లేదా కంకరపొడిని వాడారు. అంతేకాకుండా రోడ్ల నిర్మాణానికి ముందు నేలకు కంకర పోసి చదును చేయాలి. గట్టిపడిన తర్వాతే రోడ్డు వేయాలి. సమాంతరంగా ఉండేలా చూడాలి. అవసరమున్న చోట మొరంపోసి రోలింగ్ చేయించాలి. గోతులు లేకుండ చేసిన తర్వాత ఆరు నుంచి ఏడు అంగుళాల మందంతో ఇసుక, సిమెంట్, కంకర సమపాళ్లలో కలిపిన మిశ్రమాన్ని పోయాలి. పనుల సమయంలో వైబ్రేటర్‌తో చదును చేయాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వీటన్నింటినీ గుత్తేదార్లు పట్టించుకోలేదు. ఇసుక, కంకరపొడిని విచ్చలవిడిగా వాడారు. మందాన్ని తగ్గించారు. సిమెంట్ శాతం తగ్గించారు. దీంతో రోడ్డు వేసిన కొద్ది రోజులకే పగుళ్లు ఏర్పడుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే..

ఇలా ఒక్క అందోలు నియోజకవర్గంలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో రూ.27.32 కోట్లతో 472 సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయి. వాటిలో 80 శాతం పనుల్లో నాణ్యత లోపించిందని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. పుల్కల్ మండలం కోడూరుకు ఏకగ్రీవ పంచాయతీ నిధులు మంజూరయ్యాయి. శివారులోని కోడూరు తండాలో రెండు నెలల క్రితం సీసీరోడ్డు నిర్మాణం చేశారు. అప్పుడే పగుళ్లు ఏర్పడ్డాయి. కంది మండలం ఎర్దనూరులోని దళితవాడలో వేసిన సీసీదారి పక్షం రోజుల్లోనే దెబ్బతిన్నది. అందోలు మండలం కిచ్చెన్నపల్లి గ్రామంలో పంచాయతీ నిధులతో వేసిన సీసీ రోడ్డు పూర్తిగా పాడైంది. సంగారెడ్డి మండలం ఉత్తర్‌పల్లిలోని దళిత, బీసీ వాడల్లో వేసిన సీసీ రోడ్లకు పగుళ్లు రావడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనూరు మండలంలోని చాలా గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో వేసిన సీసీదార్లు అప్పుడే పగిలిపోయాయి. ఝరాసంగం మండల కేంద్రంలో రూ.25 లక్షలతో వేసిన సీసీరోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్లు ఎలా ఉన్నా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు బిల్లులు చెల్లించడంపై స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

వివిధ రకాల నిధులు వ్యయం

• వివిధ రకాల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు ముక్కలు చెక్కలుగా గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. వేసిన కొద్దిరోజులకే పాడవుతున్నాయి.

• అందోలు నియోజకవర్గంలో రూ.4.50 కోట్ల ఉపాధి హామీ నిధులు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరయ్యాయి. వాటికి రూ.1.50 కోట్ల ఎమ్మెల్యే నిధులు జత కలిశాయి. రూ.6 కోట్లతో 120 రోడ్లు మంజూరు చేశారు.

• ఒక్కో రోడ్డుకు రూ.5 లక్షల చొప్పున కేటాయించారు. ఇవి కాకుండా ప్రత్యేకంగా రూ.కోటి ఎంపీ నిధులు మంజూరు చేశారు. మరో రూ.కోటిన్నర ఏకగ్రీవ పంచాయతీల నిధులు కేటాయించారు. ఇలా మొత్తం రూ.8.50 కోట్లతో 170 సీసీ దార్లు మంజూరయ్యాయి.

• ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనుల్లో.. చౌటకూరు పంచాయతీ శివారులోని పోసానిపల్లిలో మినహా మిగతా సీసీ రోడ్లన్నీ పూర్తిచేశారు. ఎంపీ నిధులతో చేపట్టిన రోడ్ల పనులన్నీ పూర్తయ్యాయి. ఏకగ్రీవ పంచాయతీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనులు అక్కడక్కడ పూర్తిచేయాల్సి ఉంది.

• ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన రోడ్ల పనులు పూర్తై ఐదు నెలలు అవుతుంటే.. ఎంపీ నిధులతో చేపట్టిన పనులు రెండు నెలల క్రితం పూర్తయ్యాయి. ఇక ఏకగ్రీవ పంచాయతీలకిచ్చిన ప్రోత్సాహక నిధులతో వేసిన రోడ్లు పూర్తై రెండు నెలలవుతోంది. కానీ ఏళ్ల క్రితం వేసిన రోడ్ల మాదిరిగా గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి.

నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపివేస్తాం..

– వేణుమాధవ్, ఈఈ పీఆర్ విడిజన్, జోగిపేట

చేసిన పనులన్నీ దెబ్బతినలేదు. అక్కడక్కడ అలా జరిగి ఉండవచ్చు. చేసిన పనుల్లో కొన్నింటికి కొంత మేరకు బిల్లులు చెల్లింపులు పూర్తి చేశాం. ఇంకా చాలా బిల్లులు చెల్లించాల్సి ఉంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించి.. నాణ్యత సక్రమంగా ఉందని తేల్చిన తర్వాతే బిల్లులు చెల్లిస్తాం. ఒకవేళ పనుల్లో నాణ్యత ప్రమాణాలు కన్పించకపోతే చెల్లింపులను నిలిపివేస్తాం. సరిగా లేని రోడ్ల బిల్లులు చెల్లించం.


రాయికోడ్ మండలం దౌల్తాబాద్‌లో సిమెంటు తొలగిపోయి.. తేలిన కంకర

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

• రాయికోడ్ మండలం మోరర్గ పంచాయతీకి ఏకగ్రీవ నిధులు మంజూరయ్యాయి. వాటితో దౌల్తాబాద్ గ్రామంలో సీసీ రోడ్డు వేశారు. నిర్మాణం పూర్తై నెల రోజులు అవుతుంది. అప్పుడే అక్కడక్కడ పగుళ్లు కన్పిస్తున్నాయి. పగుళ్ల మధ్యలో నుంచి ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి మొలకలు కనిపిస్తున్నాయి. సిమెంట్ పూత తొలిగిపోయి కంకర తేలింది.

• కోర్పోల్ గ్రామంలో ఎంపీ, ఉపాధిహామీ, పంచాయతీ నిధులు రూ.17 లక్షలతో మూడు బీట్లుగా సీసీదార్లు నిర్మాణం చేశారు. మూడు రోడ్లను ఇటీవల పూర్తి చేశారు. పంచాయతీ కార్యాలయం నుంచి సర్పంచి ఇంటి వైపునకు వేసిన సీసీ రోడ్డుపై చాలా చోట్ల పగుళ్లు దర్శనమిస్తున్నాయి. ఎస్సీవాడ నుంచి నీటి ట్యాంకు మీదుగా శివాలయం వరకు ఎంపీ నిధులతో వేసిన సీసీ రోడ్డు ఆనవాళ్లు కన్పించకుండా మారింది. కంకర తేలడంతో ఇలా మారింది.

• చౌటకూరులో ఎంపీ నిధులతో బీసీవాడలో వేసిన సీసీ రోడ్డుదీ ఇదే తీరు.. పర్యవేక్షణ లేకుండా పనులు చేపట్టడంతో రోడ్డుపై చాలా చోట్ల సిమెంటు తొలగిపోయి కంకర తేలింది. పగుళ్లు ఏర్పడ్డాయి. ఉపాధి హామీ పథకం నిధులతో ప్రధాన రహదారి నుంచి మరో వైపు వేసిన రోడ్డుదీ ఇదే పరిస్థితి నెలకొంది.


కోర్పోల్‌లో పంచాయతీకి సమీపంలో రోడ్డుకు పగుళ్లు ఇలా..

'అంగన్‌వాడీలను వేధిస్తే ఉద్యమిస్తాం'

సంగారెడ్డి టౌన్: అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, కార్యకర్తలను వేధిస్తే ఉద్యమిస్తామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి హెచ్చరించారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలకు కారణం లేకుండా మెమోలు జారీ చేస్తే సహించేది లేదన్నారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంగ, ఏసుమణి, నాయకులు విజయ, మంజుల, సుజాత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

కార్మిక హక్కులకు ఐక్య పోరాటాలు

సంగారెడ్డి టౌన్: కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. కార్మిక చట్టాలు యాజమాన్యులకు అనుకూలంగా మార్చటాన్ని తప్పుపట్టారు. తెరాస ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాలపరిమితి ముగిసిన జీవోలను వెంటనే సవరించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు నిర్ణయించాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 19న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, సాయిలు, బాగారెడ్డి, బాగారెడ్డి, ప్రసన్న, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు